నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం సెప్టెంబర్ 02, 2024 www.navatelangana.com

నేడు విద్యాసంస్థల బంద్

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు(సోమవారం) విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్టు ఇరు జిల్లాల కలెక్టర్‌లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటిఐలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సోమవారం సెలవును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఐటిఐలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఈ ఆదేశాలను అమలు చేయాలని పేర్కొన్నారు.

కామారెడ్డిలో నేటి ప్రజావాణి రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో నేడు (సోమవారం) కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయానికి సోమవారం నాడు రావద్దని ఆ ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

పోచారం ప్రాజెక్టు దిగువన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఆయా గ్రామాల్లో కార్యదర్శులు టామ్ టామ్ వేయించాలి : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

పోచారం ప్రాజెక్టు దిగువనగల మండలాల లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలు కురుస్తుందన్న ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి ప్రాజెక్టు నుండి నీరు కిందికి వెళుతుందనీ, పోచారం ప్రాజెక్ట్ కింది ప్రాంతాలైన హవేలీ గన్ పూర్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్ మండలాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ఆలేరువాగు, పోచారంనది పరిసర ప్రాంతాలైన పోచంర్యాల్, సర్దానా, మాల్ తుమ్మెద, గోల్లింగల్, చినూర్ నాగిరెడ్డిపేట్, వెంకంపల్లి, తాండూర్ మాసన్ పల్లి, రుద్రారం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు టాంటమ్ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు.


పోచారం ప్రాజెక్టు నిండటంతో ప్రాజెక్టుపైనుంచి పొంగిపొర్లుతున్న వరదనీరు

తెరిపివ్వలే.. ముంచెత్తింది

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- పలు మండలాల్లో అతిభారీ వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లిన వాగులు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను భారీ వర్షం ముంచెత్తింది. ఉత్తర బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో వర్షం జోరు తగ్గలేదు. శనివారం రాత్రి నుంచి మొదలైన వర్షం.. ఆదివారం సాయంత్రం వరకు తెరిపివ్వకుండా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లల్లోకి నీరు చేరడంతో.. బాధిత కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతుంది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో వరద నీరు ప్రాజెక్టుపై నుంచి పొంగిపొర్లుతుంది.

శనివారం రాత్రి మొదలైన వర్షం తెరిపి ఇవ్వకుండా కురిసింది. రాత్రంతా కురవగా ఆదివారం సైతం మధ్యాహ్నం 3 గంటల వరకు తెరిపి ఇవ్వకుండా భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. జనజీవనం స్తంభించిపోయినట్టు అయింది. తెరిపి లేకుండా వర్షం కురవడంతో జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సగటు 61.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. ధర్పల్లిలో అత్యధికంగా 169.1 మి.మీ వర్షం కురిసింది. వర్నిలో 125.9, సిరికొండలో 102.5 మి.మీ వర్షపాతం నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో భారీ వర్ష పాతం నమోదు అయింది.

భిక్కనూర్‌లో అతిభారీ వర్షం

కాగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సగటు 99.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా భిక్కనూర్‌లో అతిభారీ వర్షం పాతం నమోదు అయింది. ఏకంగా 194.5 మి.మీటర్ల వర్షం కురిసింది. అదే విధంగా సదాశివనగర్‌లో 189 మి.మీ, బాన్సువాడలో 185.3 మి.మీ, కామారెడ్డిలో 174 మి.మీ, తాడ్వాయి, దోమకొండలో 150 మి.మీ భారీ వర్షపాతం నమోదు అయింది.


కమ్మర్‌పల్లి : మత్తడి దుంకుతున్న రాళ్లవాగు


కంఠేశ్వర్ : నీటమునిగిన నిజామాబాద్ రైల్వే స్టేషన్

అధికారులు అప్రమత్తంగా ఉండండి
: కలెక్టర్ సుడిగాలి పర్యటన

పిట్లం/నిజాంసాగర్/లింగంపేట్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం పరిస్థితులు పరిశీలించేందుకు సుడిగాలి పర్యటన చేశారు. కామారెడ్డి పట్టణంతో పాటు లింగంపేట్, నిజాంసాగర్, పిట్లం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 48 గంటలలో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా ప్రజల ఆస్తి , ప్రాణ నష్టం జరగకుండా మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతా ఇళ్లలో, కాలనీలు జలమయం కావడం, విద్యుత్ స్తంభాలు , వైర్లు తెగిపోయి కరెంటు సరఫరా, పురాతన పాఠశాలలు కూలడం వాగులు వంకలు ప్రవహించడం , రోడ్లు కోతకు గురి కావడం, పంట పొలాలు నీట మునిగడం, ఇల్లు కూలడం వంటివి సంభవించే ప్రమాదం ఉన్నందున వాటిపై ప్రత్యేక నిఘా వహించి, అట్టి సమాచారాన్ని వెంటనే జిల్లా స్థాయి అధికారులకు నివేదించాలని ఆయన సూచించారు. కలెక్టర్ వెంట పిట్లం తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీఓ యాదగిరి, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్ కమల్, ఎస్సై రాజు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండల కేంద్రంలో గంగమ్మ వాగు, కన్నాపూర్ వాగు ప్రమాదకరంగా పారుతున్నాయి. మండల కేంద్రంలో, కన్నాపూర్ లో ఎస్సీ కాలనీలలో వర్షపు నీరు, మురికి కాల్వల నీరు ఇండ్లలో చేరడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇళ్లలో నీరు చేరిన కుటుంబాలను, ప్రమాదకరంగా ఉన్న ఇండ్లలోని కుటుంబాలను, ఎస్సీ కమ్యూనిటీ హాల్, పునరావాస కేంద్రాల్లో ఉంచారు. యువత, అధికారులు స్వచ్ఛందంగా బాధితులకు ఆహారాన్ని అందజేశారు. మండలంలో కురుస్తున్న వర్షాలకు ఎమ్మార్వో సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఎస్సై నరేష్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తం చేశారు. గోకుల్ తండాలో నాలుగు ఇండ్ల గోడలు కూలిపోయాయి. 24 గంటల్లో మండలంలో 23 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదయింది.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ నల్లచెరువు, నాగాపూర్ ఊర చెరువు అలుగులు పారుతున్నాయి. కోనాపూర్ శివారులోని రాళ్లవాగు ఉప్పొంగుతూ అలుగులపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుంది. బషీరాబాద్ కాడి చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో పంట పొలాలు నీట మునిగాయి.ఇనాయత్ నగర్ తండాలోని చెరువులోనికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో వరద ఉధృతికి మత్తడి రాళ్లు కొట్టుకుపోయాయి.ఉప్లూర్ లో భారీ వర్షాల మూలంగా పలువురు రైతుల సోయా, మొక్కజొన్న పంటచేలాలోకి నీరు చేరింది. కొన్నిచోట్ల సోయపంట పూర్తిగా నీట మునిగింది. భారీ వర్షాల మూలంగా జనజీవనం కూడా స్తంభించింది. వాణిజ్య వ్యాపార సంస్థలను కూడా కూడా భారీ వర్షాల మూలంగా వ్యాపారులు మూసి ఉంచారు.

జనజీవనం అస్తవ్యస్తం

ఆర్మూర్ : పట్టణంలోని మినీస్టేడియం దగ్గర చెట్టు పడిపోయింది. మహిళా మోర్చా నాయకురాలు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ స్వభావిక గౌడ్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. మున్సిపల్‌సిబ్బంది క్లియర్ చేశారు. మామిడిపల్లి చౌరస్తా వద్ద భారీగా నీరు చేరడంతో మున్సిపల్ సిబ్బందితో స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ జెసిబి సహాయంతో నీటిని తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్ స్థానిక నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఆకుల రాము తదితరులు పర్యవేక్షించారు.


రెంజల్ : కందకుర్తిలో గోదావరిలో నీటమునిగిన శివాలయం


ఆర్మూర్ పట్టణంలో నీరు నిల్వ ఉండకుండా జేసీబీతో పనులు


నిజాంసాగర్ : నాగమడుగు కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్


రామారెడ్డి : పునరావాస బాధితులకు భోజనం అందజేస్తున్న స్థానికులు

ప్రాజెక్టులకు భారీ వరద

- ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో
- పొంగిపొర్లుతున్న పోచారం
- సింగీతం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-విలేకరులబృందం

భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతుంది. దీంతో ప్రాజెక్టుల నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ఉత్తర తెలంగాణ వరదప్రదాయిని ఎస్సారెస్పీకి వరద నీరు వచ్చి చేరుతుంది. ఉదయం వేల 37 వేల ఇన్‌ఫ్లో వచ్చి చేరగా.. రాత్రి 9 గంటల సమయంలో ప్రవాహం పెరిగి 60 వేలకు చేరింది. ప్రవాహం పెరుగుతున్న కారణంగా గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, పశు కాపరులు గోదావరిలోకి, ప్రాజెక్టు కాలువల్లోకి దిగొద్దని అధికారులు సూచించారు.


ఎస్సారెస్పీ

ఎస్సారెస్పీకి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా రాత్రి 8 గంటల సమయంలో 1086.3 అడుగుల 64.036 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. వరద కాలువకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీ వరద

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి ఉదయం నుంచి ప్రవాహం కొనసాగింది. రాత్రి 9 గంటల సమయంలో 28,900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ ఆదివారం తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 5.514 టీఎంసీల నీరు ఉంది అని ఆయన తెలిపారు.వర్షాభావంతో వాగులు,వంకల్లో వరద నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అందర్ కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

సింగీతం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సింగీతం రిజర్వాయర్ ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షానికి ఆదివారం రిజర్వాయర్‌లోకి 10,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్టు జన వనరుల శాఖ అధికారి శివ తెలిపారు. ప్రస్తుతానికి సింగీతం రిజర్వాయర్ నిండు కుండలా ఉన్నదని రిజర్వాయర్‌లోకి 10500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతండగా.. 9500 క్యూసెక్కుల నీరు మత్తడి నుంచి వెళ్తుండగా.. 1000 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ కాలువకు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. సింగీతం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లుగా ప్రస్తుతానికి 416.550 మీటర్ల నీళ్లు నిలువ ఉన్నాయి.

పొంగిపొర్లుతున్న పోచారం

నాగిరెడ్డిపేట్ : గత రెండు రోజుల నుండి భారీగా వర్షాలు కురవడంతో పోచారం ప్రాజెక్టు ఆదివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో నుండి పొంగిపొర్లుతుంది. పోచారం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1.820 టీఎంసీలు 1464 ఎం సి ఎఫ్ టి ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షం కురియడంతో 30 వేల క్యూసెక్కుల నీరు పోచారం ప్రాజెక్టులోకి రావడంతో అదే స్థాయిలో పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతుంది. వర్షాకాలం ప్రారంభం నాటి నుండి ఎప్పుడు నిండుతుందా? ఎప్పుడు పొంగుతుందా అని ఎదురుచూస్తున్న రైతులకు శుభవార్త అందించినట్టు అయింది. పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండితే ఖరీఫ్ తో పాటు రబీలో కూడా 16 వేల ఎకరాలకు నీరందిస్తుంది. అలాంటి పోచారం ఆలస్యంగా నిండడంతో రైతన్నలు ఆందోళన పడ్డారు. ప్రాజెక్టును ఆదివారం ప్రాజెక్టు డీఈఈ వెంకటేశ్వర్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు.


పొంగిపొర్లుతున్న సింగితం


నిజాంసాగర్‌కు చేరుకున్న నీరు

ప్రభుత్వ ఇండ్లు పేదల స్వాధీనం

- ఒక్కొక్క ఇంటిని ముగ్గురు..
- అర్హులను గుర్తిస్తామన్న అధికారులు



ఇండ్లను స్వాధీనం చేసుకున్న పేదలు.. ఇంటికి తాళం వేస్తున్న ఓ మహిళ

నవతెలంగాణ-బీర్కూర్ (నసురుల్లాబాద్)

అతి నిరుపేదలకు నివసపు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిరుపేదలు గత కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. స్పందించిన ఎమ్మెలే పోచారం శ్రీనివాస్ రెడ్డి బీర్కూర్ మండల కేంద్రంలో సింగల్ బెడ్ రూములను నిర్మించారు. గత ఆరు మాసాల నుండి పాలకులు, అధికారులు స్పందించకపోవడంతో విసుగుచెందిన నిరుపేదలు ఐక్యంగా కదం తొక్కారు. ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను ఆదివారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకొని ఇంటికి తాళాలు వేశారు. గత రెండేళ్ల క్రితం బీర్కూర్ మండల కేంద్రంలో సింగిల్ బెడరూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వాటిని పంపిణీ చేయడంలో అధికారులు, కాంగ్రెస్ పాలకులు స్పందించకపోవడం వల్ల, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండలేక కొందరు, ఇల్లు లేక కొందరు, మరి కొందరు బీర్కూర్ పోలీస్ స్టేషన్ సమీపం వద్ద నిర్మించిన రెండు, ఒక , పడక గదులను చొరబడి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంలో కొంతమంది ఇల్లు ఉన్నవారు కూడా ఇంటిలో చేరబడడంతో పేదవారు వారి పనితీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. 36 ఇళ్ళను నిరుపేదలు చొరబడి స్వాధీనం పర్చుకోవడంతో పరిస్థితి ఉధృత గా మారింది. పక్షం రోజుల క్రితమే ససురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో 25 ఇళ్లలు నిరుపేదలు చొరబడి విషయము పాఠకులకు తెలిసిందే. తాజాగా బీర్కూర్ మండల కేంద్రంలో 36 ఒక పడక గదులను చొరబడడం పాలకుల నిర్లక్ష్యాన్ని చాటి చెబుతుంది, ఒక్కొక్క గదిని ఇద్దరు ముగ్గురు తాళాలు వేసుకోవడంతో వారి మధ్య గొడవలు చోటు చేసుకుంటుంటాయి. ఈ విషయంలో అధికారులు పాలకులు స్పందించి గ్రామంలో సర్వే నిర్వహించి నిరుపేదలను గుర్తించి వారికి ఇల్లు కేటాయించాలని నిరుపేదలు కోరుతున్నారు. పోలీసులు ఘటన చేరుకుని ఇంటి కోసం ఎవరు గొడవలు పడవద్దని అర్హులైన వారికి గుర్తించి ఇస్తారని సముదయించారు.

పొంగి పొర్లుతున్న వాగులు

వాహనాల దారిమళ్లింపు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నసురుల్లాబాద్ : బాన్సువాడ డివిజన్ పరిధిలో నసురుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండటంతో భారీ వర్షానికి రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం పాత బ్రిడ్జిని తవ్వేయడం, పక్కనే మరో చిన్న తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటు చేశారు. కింది నుంచి నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో బోధన్-నిజామాబాద్ నుంచి బాన్సువాడకు రాకపోకల కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ వంతెన వద్ద వాగు పొంగిపొర్లడంతో వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది కావడంతో వాహనాలను అధికారులు మరలించారు.

ముంపునకు గురైన సబ్‌స్టేషన్

భారీ వర్షాలు, వరదలకు బాన్సువాడ డివిజన్ పరిధిలో ఉన్న కొన్ని విద్యుత్ సబ్ స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి 33/11 కేవి స్టేషన్ లోకి వరద నీరు వచ్చి చేరడంతో విద్యుత్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. సబ్ స్టేషన్ చుట్టూ వరద నీరుతో పాటు విషయసర్పాలు సంచరించాయి. విద్యుత్ సబ్ స్టేషన్ లోకి వరద నీరు రావడంతో విద్యుత్ సిబ్బంది ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో దాదాపు ఎనిమిది గంటల పాటు వర్షం నీటిలో సిబ్బంది ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు నీరు వెళ్లి పోయేలా చేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.


పెద్దకొడప్‌గల్ : పోచారంతండా- పోచారం మధ్య


వెంగళ్‌పాడ్‌పాటితండా వద్ద..

పోచారం గ్రామానికి రాకపోకలు బంద్

పెద్దకోడప్‌గల్ : మండలంలోని పోచారం తండా-పోచారం గ్రామానికి మధ్యలో బ్రీడ్జ్ పై నుండి నీళ్ల ప్రవాహం భారీగా పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెండేండ్ల క్రితం భారీవర్షాలకు బ్రిడ్జి సగం కూలిపోయిందని ఈ విషయం అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వరద ప్రవాహంలో జనాలు వెళ్లకుండా పోలీస్ అధికారులు బ్రిడ్జ్‌కు అడ్డంగా జేసిబిని అడ్డం పెట్టారు.

రాకపోకలకు అంతరాయం

పోతంగల్ : మండలంలోని కొల్లూరు-దోమలేడిగి గ్రామాల మధ్యలో బ్రిడ్జి నిర్మాణం వద్ద తాత్కాలిక డైవర్షన్ రోడ్డు పైనుండి ప్రవాహం వెళుతున్నందున, ప్రజల రాకపోకలను నిలిపివేశారు. ఆ మార్గం నుండి బోధన్ వరకు వెళ్లే వారు వెళ్ళవద్దని రెండు వైపులా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడం జరిగినదని తహసీల్దార్ జె. మల్లయ్య తెలిపారు.

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండలంలోని వెంగళ్‌పాడ్ పాటి తండా వద్ద తాత్కాలిక బ్రిడ్జి పై నుండి నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో ధర్పల్లి, సిరికొండ, బీమ్ గల్ రాకపోకలను మూసి వేసినట్లు ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి నుండి పోలీస్ సిబ్బందిని నియమించి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో ధర్పల్లి, సిరికొండ, భీంగల్ మండల కేంద్రాలతో పాటు, ఆయా గ్రామాలకు రాకపోకలను సాగించే వారికి తిరిగి రాంపూర్, మల్లాపూర్, లోలం, ఎల్లారెడ్డి పల్లి గ్రామాల మీదుగా ఇందల్ వాయి తిరిగి రావచ్చని సూచించారు. ప్రస్తుతం రోడ్డు మూసి వేసినట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు.

రోడ్డు బ్లాక్

మోపాల్ : మంచిప్ప నుండి వెళ్లే అమ్రాబాద్ రోడ్డుని బ్లాక్ చేయడం జరిగింది. తహసీల్దార్ రామేశ్వర్, ఎస్‌హెచ్‌ఓ యాదగిరి గౌడ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



నసురుల్లాబాద్ : బొమ్మన్‌దేవ్‌పల్లి చెరువుకు పడిన గండి పూడ్చివేత.. నీటమునిగిన సబ్‌స్టేషన్


మంచిప్ప-అమ్రాబాద్ వెళ్లే రోడ్డుమూసివేత


నిజామాబాద్‌లో పాత కలెక్టర్‌గ్రౌండ్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఓపీఎస్ సాధించే వరకూ
అలుపెరగని పోరాటం చేస్తాం

- సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం
- వర్షంలోనూ టీఈజీ జేఏసీ నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

పాత పెన్షన్ విధానాన్ని అమలు అయ్యేవరకు ఉద్యమిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన సిపిఎస్ రద్దు, ఐటీ సీలింగ్ 10 లక్షలకు పెంచాలని, ఉద్యోగస్తుల పెండింగ్ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి, భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరసన కార్యక్రమాల్లో నినాదాలతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ దారులు హోరెత్తించారు. 1.2.2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగం పొందిన ప్రతి ఉద్యోగికి పాత పెన్షన్ విధానం(ఓ పి ఎస్) రద్దయి, కొత్త పెన్షన్ విధానాన్ని(సిపిఎస్) అమలు చేసిన నేపథ్యంలో దురదృష్టవశాత్తు కొంతమంది ఉద్యోగులు మరణిస్తున్నప్పటికీ సరైన, విధి విధానాలు లేనందున వారికి ఎటువంటి పెన్షన్ రాక అట్టి కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొందని అన్నారు. సిపిఎస్ అంతమయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంఘం అమృత్ కుమార్, హనుమంత రెడ్డి, టి జి ఆర్ ఈ ఎస్ ఏ కార్యదర్శి ప్రశాంత్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : రాష్ట్ర ఉద్యోగ జేఏసీ పిలుపుమేరకు సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నల్ల గొడుగులతో, నల్లటి దుస్తులతో ప్లే కార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్ పెన్షన్ విధానం కూడా ఆమోదయోగ్యం కాదని ఓపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఏదీ లేదని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఓ పి ఎస్ అమలు చేయాలని స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఈజీ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సిహెచ్ అనిల్ కుమార్, వెంకట్ రెడ్డి, సాయిలు, సాయి రెడ్డి, దామోదర్ రెడ్డి, కుంట ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో మున్సిపల్ ఎదుట..

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

భీంగల్ పట్టణానికి చెందిన 60 సంవత్సరాల మహిళ జుబేద గత రెండు సంవత్సరాలుగా చెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన జుబేదా, కుటుంబం చికిత్స చేయించలేక సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్, భోజ రాజు, పుప్పాల విశాల్, సుంకరి సురేష్ తదితరులు తక్షణ సహాయంగా 5500 జుబేదాకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ జుబేదా దీనస్థితిని అర్థం చేసుకొని దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే జుబేదా విషయాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులకు తెలియజేసి ప్రభుత్వం ద్వారా ఉచిత వైద్యం అందేలా ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో అరవింద్, రహీల్, అభినవ్, రుమాన్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్ నగర్ తండాలో ఘనంగా తీజ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని వివేక్ నగర్ తండాలో ఆదివారం ఘనంగా తీజ్ పండుగను నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు బాగుండా లని తీజ్ పండుగను బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో కోతుల వేట

- ఒక్క కోతి పట్టుకుంటే రూ.400
- ఆంధ్ర వేటగాళ్లతో వీడీసీ ఒప్పందం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో మూడు రోజులుగా కోతుల వేట కొనసాగుతుంది. కోతులను పట్టేందుకు స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రకు చెందిన వేటగాళ్లతో ఒప్పందం చేసుకొని కోతులను పట్టిస్తున్నారు. వేటగాళ్లు పట్టుకునే ఒక్కో కోతికి రూ. 400 చెల్లించేలా బేరం కుదుర్చుకొని మూడు రోజులుగా వేటగాళ్లు వాటిని పడుతున్నారు. గత కొంతకాలంగా గ్రామంలో కోతుల బెడద ఎక్కువైంది. గ్రామంలో పలువురిపై కోతులు దాడులు చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు జరిగాయి. ఇండ్లపై పెంకుల్ని పగలగొట్టి నష్టం చేశాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కోతుల్ని పట్టించాలనే గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారుల సహకారంతో కోతుల వేట కొనసాగుతుంది. స్థానిక అటవీ రేంజ్ కార్యాలయంలో కోతుల్ని పట్టేందుకు బోన్లు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్లపై తిష్ట వేసి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్న కోతుల్ని పట్టుకునేందుకు పాఠశాలలో కూడా ప్రత్యేకంగా ఒక బోనును ఏర్పాటు చేశారు. కోతులు పట్టేందుకు ఏర్పాటు చేసిన బోనులో ఎరగ వేసేందుకు అరటి పండ్లు, పల్లీలు, పుట్నాలు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమకూరుస్తు న్నారు. కాగా బోనులో చిక్కిన కోతుల్ని సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టకుండా ఇచ్చోడ అటవీ ప్రాంతంలోని కోతుల సంరక్షణ కేంద్రానికి తరలించేలా చర్యలు చేపడుతు న్నారు. గ్రామంలో ప్రజలను గాయపరుస్తూ, ఆస్తులకు పంటలకు నష్టం కలిగిస్తున్న కోతుల బెడద తీరని ఉండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా గత మూడు రోజులుగా సుమారు 60 నుండి 70 కోతులు పట్టుకున్నట్లు ఆంధ్ర వేటగాళ్లు తెలిపారు.



కోతులు పట్టుకున్న వేటగాళ్లు

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండలం లోని రహత్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సేవాలాల్ వాళ్ళ తమ్ముడు భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదిఆవరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అలాగే మండలంలోని దేవక్కపేట్ గ్రామానికి చెందిన సాయిలు వాళ్ళ మామ ఆనంద్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

బిసిటియు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని బీసీడీయూ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సిపిఎస్ విధానంవల్ల ఉద్యోగ విరమణ తరువాత ఉద్యోగి కుటుంబం రోడ్డు పైకి వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. అనేక రాష్ట్రాలలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిందని తెలిపారు. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన మేరకు తక్షణమే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ శంకర్, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్, డిచ్ పల్లి మండలం బిసిటియు అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ప్రభుత్వ ఉద్యోగి తన చందా జమ చేసి పెన్షన్ తీసుకొనే విధానాన్ని తాము ఒప్పుకోనేది లేదని, ప్రభుత్వ ఉద్యోగి పాత విధానంలోనే పెన్షన్ నిర్ణయం జరగాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం ఒక ప్రకటనలో (టీఆర్‌టీఎఫ్)డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగి తన నెల జీతం కాంట్రిభూషన్ సర్వీస్ కాలంలో 50 శాతం జమ చేస్తే 20 శాతం తీసుకొని 30 శాతం తిరిగి ఇచ్చే పెన్షన్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టిన 25 ఏళ్ల తరువాత 20 శాతం నష్టంతో ఇస్తారని తెలిసి ఎవరైనా పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా..? అని ప్రశ్నించారు. ఈ విషయంపై కేంద్రం పునరాలోచన చేయాలని, తెలంగాణ రాష్ట్రం కేంద్ర విధానం నుంచి వైదొలగి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా మాట తప్పకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్రంలో ఏర్పడిన తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఏసి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం జరపడం సంఘాల ఐక్యతకు నిదర్శనం అని తెలిపారు. ఇకపై అన్ని సమస్యలపై కలిసి (టిజిఇజెఏసి) గా కలసి పోరాడుతామని పేర్కొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తప్పా బయటకు వెళ్లొద్దు :ఎస్ఐ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇళ్లల్లో నుండి బయటకు వెళ్లరాదని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో మూడురోజులపాటు భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేసిందని వివరించారు. నిజామాబాద్ జిల్లా కూడా రెడ్ అలర్ట్ జాబితాలో ఉన్నందున జిల్లాలోని దాదాపుగా అన్ని మండలాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇళ్లల్లో నుండి బయటకు వెళ్లరాదు. రెడ్ అలర్ట్ ఉన్నందున ప్రయాణాలను రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలు, వారి వివరాలు సంబంధిత గ్రామ, మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్ళకూడదుని, చిన్నపిల్లలను అస్సలు ఇంటి నుండి బయటకు రానివ్వద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలను ఎట్టి పరిస్థితిలో తాకరాదని, మురికి కాలువలు, నాళాలు, మ్యాన్ హోల్స్ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి వస్తే తప్ప బయటకు రాకూడదని విన్నవించారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడితే వెంటనే కమ్మర్ పల్లి ఎస్ఐ ఫోన్ నంబర్ 87126 59868, లేదా డయల్ 100కి కాల్ చేసి తెలియజేయాలని ఎస్ఐ అనిల్ రెడ్డి మండల ప్రజలను కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నిజామాబాద్ నగర రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రైల్వే స్టేషన్ గూడ్స్ పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుచుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. వ్యక్తి దగ్గర వివరాలు వెతకగా బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు వచ్చిన బస్సు టికెట్ లభ్యమయిందని తెలియజేశారు. అలాగే అతని చెయ్యిపై ఆర్ఆర్ఆర్ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసినా వారు రైల్వే ఎస్ఐ 8712658591 నంబర్‌కు తెలపాలని సూచించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిజామా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్సై సాయి రెడ్డి పేర్కొన్నారు.



గుర్తుతెలియన వ్యక్తి మృతదేహం

ప్రజల గోస పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్



విద్యుత్ సరఫరా నిలిచిపోయింది... అయ్యా విద్యుత్ సమస్య వచ్చింది, రండి అని విద్యుత్ శాఖ అధికారులకు, లైన్మెన్‌లకు ఫోన్ చేసిన రాంగ్ నెంబర్ అని చెప్పి ఫోన్ కట్ చేస్తూ విద్యుత్ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి అధికారుల నిర్లక్ష్యపు పనితీరుకు పరాకాష్టగా నిలిచింది. భీంగల్ పట్టణంలో ఓ కార్ మెకానిక్ గ్యారేజ్లో మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో కార్బన్ వచ్చి విద్యుత్ నిలిచిపోయిందని స్థానిక లైన్మెన్‌కు గ్యారేజ్ నిర్వాహకుడు ఫోన్ చేసి చెప్పాడు. సదురు ప్రకాష్ అనే లైన్మెన్ నా వ్యక్తిగత ఫోన్ నెంబర్‌కు ఎందుకు కాల్ చేశావు.. అది రాంగ్ నెంబర్ అవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన నెంబర్‌కు చేయాలి.. అది నీ దగ్గర పెట్టుకోవాలి కదా.. పెట్టుకోకపోవడం నీ తప్పు నాకు ఫోన్ చేస్తే రాంగ్ నెంబర్ అని చెప్తాను.. అంటూ సదురు విద్యుత్ ఉద్యోగి అనడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ సమస్య వచ్చిందని లైన్మెన్‌కు ఫోన్ చేస్తే లంచం ఇస్తేనే పనిచేస్తారని సదురు గ్యారేజ్ నిర్వాహకుడు అధికారులను నిలదీయడంతో నీళ్లు మింగడం మొదలుపెట్టారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడి కిందిస్థాయి అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అక్బర్ నగర్‌లో శనివారం అనుమానస్పద స్థితిలో హాస్టల్ బాత్రూంలో చనిపోయిన విద్యార్థి రక్షిత మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ ఆర్మూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి మృతిపై మాట్లాడారు. విద్యార్థి రక్షిత చనిపోయే ముందు సీసీ కెమెరాలు అదే సమయంలో పనిచేయకపోవడం, కుటుంబ సభ్యులు రాకముందే అమ్మాయి మృతదేహాన్ని హుటాహుటిన హాస్పిటల్ కు తరలించడం చూస్తుంటే పోలీసులు అధ్యాపకులు కలిసి లోపాయికారీ ఒప్పందానికి పాల్పడ్డట్టు అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. మృతి చెందిన విషయాన్ని కుటుంబానికి తప్ప బయటకు పొక్కకుండా ప్రయత్నాలు చేశారని,కావున స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈ విషయంపై స్పందించాలని తెలిపారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని పోలీసు అధికారులకు ఆదేశించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు చేపట్టాలని, చనిపోయిన అమ్మాయి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో నాయకులు వెంకటేష్, కైఫ్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు వాయిదా

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో నేడు ప్రారంభం కానున్న ఉమ్మడి బాల్కొండ మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు ఆదివారం ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ తదుపరి తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని ఉమ్మడి మండల వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం,ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

పరవళ్లు తొక్కుతున్న వాటర్‌ఫాల్

రెడ్ అలర్ట్ తో సందర్శకులకు నో ఎంట్రీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామంలో దట్టమైనాడు అడవిలో ఉన్న సిర్నాపల్లి వాటర్‌ఫాల్ శనివారం రాత్రి నుండి పరవళ్ళు తొక్కుతూ చూపరులకు కనువిందు చేస్తుంది. కానీ వాతావరణ శాఖ నిజామాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్ జిల్లాగా ప్రకటించడంతో రాబోవు రెండు రోజులపాటు వర్షం పడడంతో ఈ పరవళ్లను చూడడానికి వెళ్లే వాళ్లకు గ్రామస్తులు నిషేధం విధించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అక్కడికి వెళ్ళరాదని చాటింపు చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. సంస్థానాధీశులు చీలం జానకీబాయి నిర్మించిన చెరువు అలుగు నుండి నీటి ప్రవాహంతో పాల పొంగులా నీరు రావడంతో సిర్నపల్లి "వాటర్ ఫల్" పరవళ్ళు తొక్కుతోంది. ఈ చెరువు 40 అడుగుల ఎత్తు నుండి కిందికి వచ్చే నీటి సవ్వడులు ప్రకృతి రమణీయమైన దృశ్యాలు చూసిన వారెవరైనా పరవశించి పోవాల్సిందే. ఈసారి సరైన వర్షాలు లేక కొన్ని రోజులు మాత్రమే వాటర్ ఫాల్ కనువిందు చేసింది.



పైనుంచి పడుతున్న నీటి పరవళ్లు

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

- బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఆదివారం 8వ రాష్ట్ర సబ్-జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీలను స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక అభివృద్ధికి చాలా అవసరమని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ... 24 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు స్వాగతం పలుకుతూ వారికి ఏర్పాట్లు మున్సిపల్ తరపున చేస్తామని హామీనిచ్చారు. ఈసందర్భంగా జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షులు మెడిదల రవి గౌడ్ మాట్లాడుతూ.. మరుగున పడుతున్న ఆటను జిల్లా తరపున నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికై పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తేవాలన్నారు. రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఈ టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 31 నుండి నుండి అక్టోబర్ 4 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరిగే జాతీయ పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమ సభాధ్యక్షులు జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యా యులు పుప్పాల లక్ష్మీ నరసయ్య, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్ బొజ్జ మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈ భూపతి, కోశాధికారి మర్కంటి గంగా మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పెంట జలంధర్, రాజ్ కుమార్, కే సంగీతరావు సంయుక్త కార్యదర్శులు ఆశిల అనిల్ ,నవీన్, దండు అనిల్, ఈ నరేష్, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి మౌర్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌ఓను సన్మానిస్తున్న పలువురు

హిందీ ఉపాధ్యాయుని ఉద్యోగ విరమణ

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని రామన్నపేట్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ భాషోపాధ్యాయులు సాత్పుతే జగదీష్ 31 ఆగస్టు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివాజీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది అందరికీ ఉంటుందని, సర్వీస్ కాలంలో విద్యార్థులకు ఎనలేని సేవలు అందించిన జగదీష్ సమయపాలన అంకితభావంతో విధులు నిర్వహించారని అన్నారు. రిటైర్మెంట్ తర్వాత సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, బంధువులు,మిత్రులు, శ్రేయోభిలాషులు ఈ దంపతుల శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శాలువాలు పూలమాలలతో సన్మానించి "పదవీ విరమణ" శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానంతోనే హత్య

రెండవ భార్యను చంపిన చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అనుమానం పెనుభూతం కావడంతో రెండవ భార్య ను హత్య చేసిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ వివరించారు. ఆదివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో హత్య వివరాలను వెల్లడించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని యాచారంకు చెందిన రాథోడ్ విజయ (ఏ)మీనాక్షి (32)కి డిచ్‌పల్లి మండలంలోని వెస్లీ నగర్ తండాకు చెందిన రాథోడ్ గబ్బర్ సింగ్‌తో 2016 లో రెండవ వివాహం కాగా విజయకు సంతానం కలుగలేదు. గబ్బర్ సింగ్ తను వృత్తి రిత్యా హైదరాబాదులో పనిచేస్తూ తన రెండవ భార్య విజయతో కలిసి గత సంవత్సర కాలం నుండి హైదరాబాదులో ఉండగా, గబ్బర్ సింగ్ కొన్ని రోజుల క్రితమే డిచ్ పల్లి రైల్వేస్టేషన్‌లోని తన ఇంటికి వచ్చి ఉండగా, గతనేల 29 న రాత్రి మృతురాలు కుడా డిచ్ పల్లి ఆర్ఎస్ వద్ద గల వారి ఇంటికి వెళ్ళిందని వివరించారు. మృతురాలు విజయ వారి ఇంట్లోనే అనుమానస్పద స్థితిలో ఉరివేసుకొని మృతి చెందినట్లు, ఈ విషయమై విజయ తల్లి సకున ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. మృతురాలి భర్త గబ్బర్ సింగ్ హత్య చేశాడనే పిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, దర్యాప్తులో భాగంగా మృతురాలి భర్త రాథోడ్ గబ్బర్ సింగ్ తను హైదరాబాద్‌లో లేని సమయంలో మృతురాలు హైదరాబాద్‌లో ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానం పెంచుకుని గతనెల 29 నాడు మృతురాలికి ఫోన్ చేసి డిచ్ పల్లి కి పిలిపించుకున్నాడు. సాయినగర్ లోని తన ఇంట్లోని రెండవ అంతస్తులో తిట్టి, కొట్టి చున్నితో మెడకు గట్టిగ గొంతు బిగ్గించి చంపివేసి, తర్వాత ఫ్యాన్‌కు వేలాడ తీసి, మృతురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా డిచ్‌పల్లి సీఐ వారి సిబ్బంది ఆగస్టు 31న గబ్బర్ సింగ్ ని అరెస్ట్ చేసి, ఆదివారం రిమాండ్‌కు తరలించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ

మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షున్ని సన్మానిస్తున్న సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్ర శివారులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా దంతుల రమణయ్య, మండల ఉపాధ్యక్షులుగా బెజగం వెంకటేష్, కార్యదర్శిగా జొన్నల భూషణ్, కోశాధికారిగా కటకం భాస్కర్, ముఖ్య సలహాదారులుగా చిటికేసి గంగాధర్, మార్యాల నాగభూషణం, ఆమేడ నరేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన దొంతుల రమణయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికల సహకరించిన మండల ఆర్యవైశ్య సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల అధ్యక్షులుగా ఎన్నికైన రమణయ్యను మండల సంఘ సభ్యులు అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు నల్ల గణేష్ గుప్తా, చిటికేసి రఘు, జొన్నల చిన్న భూమయ్య, ఆమెటి శంకర్, నీలి గోపాల్, తదితరులు పాల్గొన్నారు

ఫ్యాన్లు వితరణ చేసిన అసిస్టెంట్ మేనేజర్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయానికి మాచారెడ్డి మండల కోపరేటివ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భిక్కనూర్ పట్టణానికి చెందిన పురం రాకేష్ అనుష దంపతులు శ్రావణమాసం సందర్భంగా 6 ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

భిక్కనూర్ మండల చరిత్రలో భారీ వర్షం

- **19.5 సెంటీమీటర్ల వర్షంతో ఒక్కరోజులోనే నిండిన చెరువులు, కుంటలు**

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండల చరిత్రలో అత్యధిక భారీ వర్షపాతం నమోదు అయింది. శని, ఆదివారం కలిసి 19.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్టు అధికారులు తెలిపారు. మునుపెన్నడూ ఇంత భారీ వర్షం కురవలేనట్టుస్థానికులు సైతం పేర్కొన్నారు. అయితే 2006లో 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఒక్కరాత్రి కురిసిన భారీ వర్షానికి భిక్కనూర్ మండలంలోని అన్ని గ్రామాలలో కుంటలు, చెరువులు జలకళలాడుతున్నాయి. చెరువులు నిండి అలుగు పారడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముందస్తు చర్యలలో భాగంగా మండల ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా సమాచారం తెలియగానే ఎమ్మార్వో శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, ఎస్సై సాయి కుమార్ అందుబాటులో ఉండి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

పెండ్లి చేసుకొమ్మనందుకు..
అంతమొందించాడు

- **నర్సును హత్య చేసింది ప్రియుడే**
- **వివరాలు వెల్లడించిన బాన్సువాడ సీఐ కష్ణ**

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు మమత (23) అనుమానాస్పద స్థితిలో మతి చెందిన విషయం తెలిసిందే. కాగా పోలీసులు ఆ కేసును ఛేదించారు. బాన్సువాడ టౌన్ సీఐ కష్ణ ఆదివారం కేసు వివరాలను వెల్లడించారు. బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన మమత, ప్రశాంత్ మూడేళ్లగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని మమత ఒత్తిడి తేవడంతో, ప్రియుడు ప్రశాంత్ ఆమె అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. గత గురువారం ఆమె గొంతుకు చున్నీ బిగించి హత్య చేశాడు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలివెళ్లాడు. మమత కుటుంబీకులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్య చేసింది ప్రశాంత్‌గా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చేధించడంలో సహకరించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కరెంట్ స్థంభాలను ముట్టుకోవద్దు

- **విద్యుత్‌శాఖ అధికారుల సూచన**

నవతెలంగాణ-మద్నూర్



భారీగా కురుస్తున్న వర్షం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు.

1.తడిసిన కరెంట్ స్థంభాలను ముట్టుకోరాదు.

2.తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదు.

3.విద్యుత్ లైన్‌కు తగులుచున్న చెట్లను ముట్టుకోరాదు.

4.విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయవలెను.

5.పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు.

6.ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదు.

7.బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి.

8.కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు.

9.చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి.

10.క్వార్టర్‌లలో ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు.

11.గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు.

12.ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెను.

13.ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయవలెను.

14.వర్షం పడుచున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌ల స్విచ్‌లను ఆఫ్ చేయవలెను. లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.

15.కరెంటు లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు.

16.ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం లేదా ఏఈ దృష్టికి తీసుకెళ్లాలి.

నిరుపయోగంగా హౌజింగ్ కార్యాలయ భవనం


హౌజింగ్ కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గతంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నిరుపయోగంగా మారింది. ఇందులో అప్పట్లో అధికారులు హౌజింగ్ కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. తదనంతరం కార్యాలయం తీసేయడంతో ప్రస్తుతం అది పిచ్చి మొక్కల మధ్య నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని ఏదైనా కార్యాలయానికి ఉపయోగిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగా వదిలేయడంతో పిచ్చి మొక్కలతో కళావిహీనంగా మారింది.

జాగ్రత్తలు పాటించండి

నవతెలంగాణ-మద్నూర్

భారీగా కురుస్తున్న వర్షాలు మూలంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. ఎవరు కూడా సాధ్యమైనంత వరకు ఇంటి నుండి బయటకు రావొద్దని, శిథిలావస్తలో ఉన్న ఇంటిలో ఉండవద్దని, వాగుల నుండి నీరు ఓవర్ ఫ్లో అయి రోడ్డు మీద నుంచి వెళ్తున్న దారిలో నుండి ప్రయాణం చేయవద్దని, విద్యుత్ స్తంభాలను, ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ వైర్లను ముట్టుకోవద్దని సూచించారు.

ఘనంగా మరిగెమ్మ ఆలయం వార్షికోత్సవం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని తట్టికోట్‌లో కాలనీ వాసులు ఆదివారం మరిగమ్మ ఆలయం 26వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో కౌన్సిలర్ వినోద్ పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కాళ్ల మహేందర్, ప్రధాన కార్యదర్శి ఉప్పల రామకృష్ణ, కోశాధికారి పిట్ట అబ్బయ్య, ఉపాధ్యక్షులు ఈరపురం చిన్న పోశెట్టి, కమిటీ సభ్యులు పిట్ట మహేష్, పిట్ట చిన్న అబ్బయ్య, ఈరపురం సాయిలు, ఉప్పలం పోశెట్టి, కూనింటి నాగయ్య కొండల్ వాడి రాగూర్, సాయిలు పాల్గొన్నారు.

బోధన్‌లో మల్టిక్రాఫ్ హార్వేస్టర్ షోరూం ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆటోనగర్‌లో ఆదివారం డెల్టా అగ్రిమెక్ ఇండియా మల్టిక్రాఫ్ట్ హార్వేస్టర్ షోరూంను షోరూం యజమాని రేగొండ సునంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యాధునికంగా తయారుచేసిన ఈ హార్వేస్టర్‌తో తక్కువ మెయింటెనెన్స్, డీజిల్ ఆదా కావడమే కాకుండా, ధృఢమైన డబుల్ ఛాజీస్ ఇంజన్ కలిగి ఉందని అన్నారు. రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హార్వేస్టర్ కొనుగోలు చేసిన రైతులు సాయిబాబా గౌడ్, శ్రీనివాస్, షేక్ సద్దాం అనే రైతులకు హార్వేస్టర్ తాళాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈఓ సైపుద్దీన్, సేల్స్ మేనేజర్ నవీన్ రావు, ఏరియా మేనేజర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో ధ్వంసమైన రోడ్డు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో శనివారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో మండలంలోని పల్లె పొగడ తండా నుంచి బొల్లారం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై నుండి భారీ వర్షం ప్రవహించడంతో ఆదివారం రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. రెండు గ్రామాలకు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం తాకిడికి పివిడి రోడ్డు ధ్వంసమైంది. పల్లె పొగడ తండా నుండి బొల్లారం చెరువులోకి ఈ నీరు ప్రవహిస్తుందని తాండవాసులు పేర్కొన్నారు. భారీ వర్షం కురవడంతో అడవి నుండి వచ్చే నీరంతా రోడ్డుపై నుండి ప్రవహించి బొల్లారం చెరువులోకి ప్రవహిస్తున్నట్టు తాండవాసులు తెలిపారు.

ఇంట్లో నుంచి బయటకు రావొద్దు

ఎమ్మార్వో బిక్షపతి

నవతెలంగాణ-నిజాంసాగర్

భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అందరూ కూడా ఇండ్లలోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని నిజంసాగర్ ఎమ్మార్వో భిక్షపతి కోరారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరైనా నివాసం ఉంటే వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అందరూ స్థానిక గ్రామపంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల రెవెన్యూ అధికారులు అన్నివేళలో అందుబాటులో ఉంటారని ఎక్కడైనా లోతట్టు ప్రాంతాలలో రోడ్లు కొట్టుకపోతే, చెరువులు నిండితే, నివాసపు ఇల్లు కూలిపోతే వెంటనే రెవేన్యూ శాఖ (9912800898)కి సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ప్రతి వినాయక మండపానికి కేవీఆర్ లడ్డు ప్రసాదం

- **బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి**

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డి పంపిణీ చేసే లడ్డు ప్రసాద తయారి పూజా కార్యక్రమాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భరత్, బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోని ప్రతి వినాయక మండపానికి కేవీర్ లడ్డు ప్రసాదం అందజేయనున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు చిన్నా పెద్దా తేడా లేకుండా దాదాపు 3000 మండపాలకు పంపిణీ చేస్తామని, ఈ లడ్డూల పంపిణీ గత 6 సంవత్సరాలుగా పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు తేలు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, కౌన్సిలర్‌లు ప్రవీణ్, నరేందర్, నాయకులు వెంకట్ రెడ్డి, రాజు పాటిల్, సంతోష్ రెడ్డి, రజినీకాంత్, ప్రతాప్, రఘు, ప్రవీణ్, బాలమని, స్వరూప పాల్గొన్నారు.

అజొల్లా సాగుతో ఉపయోగాలు

నవతెలంగాణ-సదాశివనగర్

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో వరి పొలాల్లో అజోల్లా వాడడం వల్ల కలిగే ఉపయోగాలను గ్రామంలోని రైతులకు ఆదివారం వివరించారు. వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న హారిక, మంజుల, వసంత, ఈషాశ్రీ, ప్రగతి, రైతులు లింగారెడ్డి, దత్తా రెడ్డి, సంతోష్ రెడ్డి, కెబి గంగారెడ్డి, ఇ.గంగారెడ్డి, సంజీవ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కరెంటు మీటర్‌ను సులువుగా పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కరెంటు మీటర్ లేని వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా సులభంగా మీటర్ అందించనున్నట్లు ఆదివారం ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా అర్హులందరికీ జీరో కరెంటు బిల్లు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తుందని, ప్రతి విద్యుత్ వినియోదారుడు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పొందేందుకు మీటర్ కలిగి ఉండాలని అన్నారు. ఎవరైనా కరెంటు మీటర్ లేనివారు గతంలో వలె మీసేవల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, చలాన్ కట్టాల్సిన అవసరం లేదని, కేవలం ఒక ఆధార్ కార్డు తీసుకుని మీ దగ్గరలోని విద్యుత్ శాఖ కార్యాలయం, సబ్ స్టేషన్‌లో నేరుగా సంప్రదించి 825 రూపాయలు చెల్లిస్తే కొత్త మీటర్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని బిపిఎల్ కుటుంబ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని గాంధారి ఎక్స్‌రోడ్డులో రోడ్డు పక్కన పడిపోయిన గుర్తు తెలియని వ్యక్తిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి సదాశివనగర్ పోలీసులు తరలించినట్లు ఆదివారం తెలిపారు. ఆయనకు కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు విజ్ఞప్తి**

నవతెలంగాణ-మద్నూర్

వాతావరణ కేంద్రం సూచనల మేరకు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్ళాలని సూచించారు. గత రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజులు వర్షాలున్నాయని వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాల వల్ల తడిసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలు తాకకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ఉండే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీ కాలువలు, వాగులు, వంకల వద్దకు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

- **పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి**
- **ఘనంగా ఎడపల్లి ఇంచార్జి ఎంఈవో ఉద్యోగ విరమణ వేడుకలు**
- **సన్మానించిన పలువురు**

నవతెలంగాణ-ఎడపల్లి


కోసరాజు రామారావు దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు..


భరతన్యాటం చేస్తున్న మహాది

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరిగా ఉంటుందని పిఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. మంగళ్‌పాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి కోసరాజు రామారావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని వీఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1989లో వృత్తి చేపట్టి విద్యార్థులకు తన వంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కోసరాజు రామారావు దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా మహాది అనే బాలిక భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జెడ్పి మాజీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎడపల్లి మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చేపూరి గంగాధర్ గౌడ్, బట్టుహన్మాండ్లు, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్గుల వనజ నాగరాజు, ఆయా మండలాల ఎంఈఓలు, మంగల్‌పాడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, శివరాజన్ కెజియ, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, ఎడపల్లి, రెంజల్, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే స్పందించాలి

నవతెలంగాణ-వర్ని

రుద్రూర్ వ్యవసాయ వరి పరిశోధన అగ్రికల్చర్ పాలటెక్నిక్ విద్యార్థిని మృతి అనుమానాలపై స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేసిన్నారు. ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు నడిపింటి కార్తీక్ మాట్లాడుతూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అక్బర్‌నగర్‌లో శనివారం అనుమానాస్పద స్థితిలో హాస్టల్ బాత్రూంలో చనిపోయిన విద్యార్థి రక్షిత మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అక్కడున్న సీసీ కెమెరాలు అదే రోజు పనిచేయకపోవడం, కుటుంబ సభ్యులు రాకముందే అమ్మాయి మృతదేహాన్ని హాస్పిటల్‌కు తరలించడం చూస్తుంటే పోలీసులు అధ్యాపకులు కలిసి లోపయికారి ఒప్పందానికి పాల్పడ్డట్టు అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. కావున స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయంపై స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని పోలీసు అధికారులకు ఆదేశించాల్సిందిగా కోరారు. చనిపోయిన అమ్మాయి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఇమ్రాన్ ఖాన్, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

వ్యాధులు ప్రబలకుండా సౌకర్యాలను మెరుగుపరచాలి

- **సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్**

నవతెలంగాణ-కోటగిరి

వ్యాధులు ప్రబలకుండా సౌకర్యాలను మెరుగుపరచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు భారీ వర్షాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ, అతి భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. వాతావరణ మార్పు వల్ల వ్యాధులు ప్రబలుతున్న ఈ సమయంలో పీహెచ్‌సీ (ప్రైమరీ హెల్త్ సెంటర్), వివిధ గ్రామాల్లో ఉన్న హెల్త్ సెంటర్లలో డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్నటువంటి వారికి ఈనెల 30 తేదీ వరకు ఈ-కేవైసీ ఆధార్ అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు చేస్తామని తెలిపిందని ఇప్పటికే రేషన్ కార్డు ఉన్నటువంటి కూలీలు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసలు పోయినందున ఈ-కేవైసీ ఆధార్ అనుసంధానానికి సమయం ఇవ్వాలని ఇటీవల పెరుగుతున్న నిత్యవసరధరలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ.విటల్ గౌడ్, సిపిఐ మండల నాయకులు నల్లగంగాధర్, బర్ల సునీల్ కుమార్, కప్పసాయిలు, నాగేష్, కొండ సాయిలు, బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుధాకర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జరభద్రం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భద్రంగా ఉండాలని ఎల్లారెడ్డి ప్రాంత ప్రజలకు సిఐ రవీందర్ నాయక్ ఆదివారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కరెంటు స్తంభాలను, విద్యుత్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్ల తాకవద్దని ఏమైనా మరమ్మతులు ఉంటే విద్యుత్ శాఖ వారికి తెలిపాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, వంతెనలు దాటే సాహసం చేయవద్దని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లలో ఉండకూడదని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులందరూ అందుబాటులో ఉండాలి

- **ఎమ్మార్వో దశరథ్**

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండల ప్రజలకు కార్యదర్శులు అందరూ కూడా అందుబాటులో ఉండాలని ఎమ్మార్వో దశరథ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరైనా నివాసం ఉంటే వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల రెవెన్యూ అధికారులు అన్నివేళలో అందుబాటులో ఉంటారని ఎక్కడైనా లోతట్టు ప్రాంతాలలో రోడ్లు కొట్టుకపోతే, చెరువులు నిండితే, నివాసపు ఇల్లు కూలిపోతే వెంటనే రెవెన్యూ (9866211588) సంప్రదించాలని ఆయన మండల ప్రజలను కోరారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలో ఐదుగురికి రెండు లక్షల 81 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో అందజేశారు. ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ జడ్పీటీసీలు శంకర్ పటేల్, శంకర్, నాయకులు ఏజాస్‌ఖాన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి తరలిన టిఎస్‌సిపిఎస్‌ఈయు శాఖ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-పిట్లం



మండల టిఎస్‌సిపిఎస్‌ఈయు శాఖ ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని పురపాలక కార్యాలయం ముందు నిర్వహిస్తున్న పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమానికి ఆదివారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రూప్ సింగ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ 1న తెచ్చిన పెట్టుబడుల స్టాక్ మార్కెట్ ఆధారిత సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా టిజిఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపడానికి బయలుదేరి వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్ రాథోడ్, ఉపాధ్యక్షులు బాల్ సింగ్, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

కొత్త సాంకేతికతతో క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్

నవతెలంగాణ-ఆర్మూర్



గరుడ ఏరోస్పేస్ ద్వారా నిధులు సమకూర్చబడిన క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల మండలంలోని చేపూర్ (గ్రామ శివారు, ఆర్మూర్, నిజామాబాద్-503224) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకోసం ఎంఓయు సంతకం పొందినట్లు కళాశాల యజమాన్యం ఆదివారం తెలిపారు. ఈ భాగస్వామ్యం డ్రోన్ రంగంలోని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఖచ్చితంగా కొత్త సాంకేతిక విలువలను జోడిస్తుందని, ఫ్లయింగ్, అసెంబ్లింగ్, నిర్వహణ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేసినందుకు మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ గరుడ ఏరోస్పేస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

శానిటేషన్ పనులను పరిశీలించిన డీపీఓ

నవతెలంగాణ - మాక్లూర్

మండల కేంద్రంలో జరుగుతున్న శానిటేషన్ పనులను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. వర్షం వల్ల నిలిచిన నీటిని తొలగిస్తున్న విధానాన్ని పరిశీలించారు. వర్షాల కారణంగా గ్రామంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తెలిపారు. ఆయనతో పాటు మండల ఇంఛార్జి ఎంపీడీఓ, పంచాయతీ అధికారి శ్రీనివాస్, గ్రం కార్యదర్శి రాకేష్, కారోబర్ శ్రవణ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీపీవో

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- సహాయకచర్లలో పాల్గొనాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సహాయక చర్యల్లో పాల్గొనాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం సూచించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో వీడియోను పోస్ట్ చేశారు. వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు వెళ్లి సహకరించాలని కోరారు. ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తప్పనిసరి అయితే తప్ప బయటికి వెళ్లకండి
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వాయుగుండంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బాల్కొండ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తప్పనిసరి అయితే తప్ప బయటికి వెళ్లకండని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు నియోజకవర్గంలో భారీ వర్షాలకు మొదటగా ఇబ్బంది పడే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని, పాత ఇండ్లు, భవనాలు ఉంటే ప్రజలకు అవగాహన కల్పించి ఆస్తి, ప్రాణ నష్టము లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండి వరద నీటిని గోదావరి లోకి వదిలే పరిస్థితి తలెత్తితే గోదావరి పరివాహక గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. గోదావరిలో చేపలు పట్టడానికి వెళ్లే మత్స్యకారులకు, పశువులు మేపడానికి వెళ్లే కాపరులకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. వ్యవసాయ పనులు కోసం పొలాలకు వెళ్లే రైతులు కరెంట్ మోటర్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు కరెంట్ పోల్స్‌కి దూరంగా ఉండలాని కోరారు. ఎలెక్ట్రిసిటీ అధికారులు కూడా పోల్స్ పడిపోయినట్టు సమాచారం అందిన వెంటనే రీస్టోర్ చేసేలా చూడాలన్నారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి చెరువులు, కుంటలను ప్రతి క్షణం పర్యవేక్షించాలని, ఎక్కడన్నా చెరువులు, కుంటలు తెగే పరిస్థితి ఉంటే ముందుగా నష్టనివరణ చర్యలు తీసుకోవాలన్నారు. నిండిన చెరువులు, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, చెక్ డ్యాం లను చూడటానికి ప్రస్తుత పరిస్తితుల్లో ప్రజలెవరు వెళ్లకూడదని ఎమ్మెల్యే కోరారు. స్థానికంగా ఉండే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉన్న చోట నాయకులు ప్రజలకు సహాయం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్రంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ, అత్యంత భారీ వర్షాల పట్ల ఆయకట్టు రైతులు అప్రమత్తంగా వుండాలని, గ్రామస్తులు వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని తహశీల్దార్ పి.శ్రీకాంత్, ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్, ఎంపీవో మహమ్మద్ గౌస్, ఏఈ రవి కుమార్ ఆదివారం వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలియజేశారు. వర్షాభావం దృష్ట్యా విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, విద్యుత్ తీగలు తెగివున్న వెంటనే విద్యుత్ అధికారుల దృష్టికి తేవాలన్నారు. గ్రామ పంచాయతీల ద్వారా పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూంలను ఏర్పాట్లు చేశారు..

శిథిలావస్థలో ఉన్న గృహాల పరిశీలన

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాగపూర్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న గృహాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగపూర్ పంచాయతీ కారోబార్ కలీం మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో గ్రామస్తులు శిథిలావస్తలో ఉన్న ఇండ్లలో ఉండవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా గ్రామపంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రమాదాలు జరగకముందే అలాంటి వారిని పునరావాసలకు తరలిస్తామన్నారు.

పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారీ వర్షాల మూలంగా ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీ ద్వారా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదిలో, గ్రామపంచాయతీ కార్యాలయంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరికైనా పాత ఇండ్లు కూలిపోయే దశలో ఉంటే అప్రమత్తంగా ఉండి గ్రామ పంచాయతీకి సమాచారం ఇచ్చి పునరావాస కేంద్రంలో ఉండాలని కోరారు. గ్రామ ప్రజలు ఎవరూ కూడా వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, గ్రామంలో ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి వుంటే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా ఆయకట్టు రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో గ్రామ పంచాయతీకి సమాచారం ఇవ్వాలని కోరారు.

నేటి పరీక్ష వాయిదా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారీ వర్షాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఈనెల 2న సోమవారం జరగనున్న థియరీ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ వాయిదా వేసినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైం టేబుల్ ప్రకారం 3 -9- నుండి జరిగే పరీక్షలు యధావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. 2న జరగాల్సిన పరీక్షను నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని కంట్రోలర్ పేర్కొన్నారు.

అలుగెల్లిన చెరువులు పొంగిన వాగులు

- రహదారుల పరిశీలించిన కాంగ్రెస్‌పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్
- వన్నెల్-చిట్టాపూర్ రహదారి మూసివేత
- కోనాపూర్‌నుండి ఆత్మకూర్‌కు రాకపోకలు బంద్



గ్రామాల్లో రహదారులను పరిశీలిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా భీంగల్ మండలంలోని మెండోరా, పల్లికొండ గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం పర్యటించి రహదారులను పరిశీలించారు. లో లెవల్ బ్రిడ్జిల కారణంగా గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఈ సమస్యలకె పరిష్కారం చేస్తామని తెలిపారు. కూలిపోయే ఇళ్లలో ఎవరు ఉండవద్దని నదులు వాగులు, వంకలు వంటి పరిసర ప్రాంతాలకు ఎవరు వెళ్ళవద్దని వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

లోతట్టు ప్రాంతాల పర్యవేక్షణ

నవతెలంగాణ-ముప్కాల్



పరిశీలిస్తున్న అధికారులు

భారీ వర్షాల దృష్ట్యా ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపల్లి, నాగంపేట్, రెంజర్ల గ్రామాలను ఎంపీడీవో, ఎస్ఐ, ఎంపీవో తదితర అధికారులు సంయుక్తంగా కలిసి పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాలు, చెరువులు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను సందర్శించి ఒక కార్యాచరణను రూపొందించారు. శిథిలావస్థలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులను గ్రామపంచాయతీ కార్యాలయంకు తరలించేలా తగు చర్యలు చేపట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామస్తులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు వీలుగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. రానున్న రెండు రోజుల పాటు గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల ద్వారా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామస్తులకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్, ఎంపీవో మహమ్మద్ గౌస్, ఎస్ఐ రజినీకాంత్, పంచాయతీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ కమ్మర్‌పల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం నుండి జోరు వానలో అధికారులతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. కాలువలు, వరదలు వచ్చే పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలెపు నరసయ్య, తదితరులు ఉన్నారు.

కోనాపూర్ నుండి ఆత్మకూర్‌కు రాకపోకలు బంద్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ నుండి జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఆత్మకూరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోనాపూర్, ఆత్మకూరు గ్రామాల మధ్యలో భారీ వర్షాల మూలంగా గుండెన వాగు పొంగిపొర్లుతుంది. వాగునీరు బీటీ రోడ్డు పైన నుండి పారుతుంది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలను అధికారులు నిలిపివేశారు. కోనాపూర్ నుండి ఆత్మకూర్ వైపు వెళ్లకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డుకి అడ్డంగా ట్రాక్టర్ ట్రాలీ నిలిపి ఉంచారు. ప్రజలు ఎవ్వరు రోడ్డు గుండా ప్రయాణించేందుకు సాహసించవద్దని అధికారులు గ్రామంలో దండోరా వేయించారు.





ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు, రోడ్డుకు అడ్డంగా పెట్టిన ట్రాక్టర్

ట్రాక్టర్‌తో రహదారి మూసివేత

నవతెలంగాణ - బాల్కొండ

మండల పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన్నెల్ (బి) నుంచి చిట్టాపూర్ మార్గంలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఆదివారం వన్నెల్ (బి) గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తో మార్గాన్ని మూసివేశామని ఎంపీఓ గంగ మోహన్ తెలిపారు. ప్రవాహం తగ్గేవరకు వాహనదారులు ఇటువైపు ప్రయాణించవద్దని కోరారు.



రహదారికి అడ్డంగా పెట్టిన ట్రాక్టర్



ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగు

నవతెలంగాణ - భీంగల్ రూరల్

భీంగల్ మండలం మెండోరా గ్రామం వద్ద నుండి రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భీంగల్ లో కప్పల వాగు వరద ఉధృతితో హైవే వంతెనకి కొంచెం దూరంలో నీళ్ల ప్రవహిస్తున్నాయి. భీంగల్ మండల ఎస్సై మహేష్ ఇంట్లో నుండి బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంతం వాళ్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఇందల్‌వాయి అలుగెళ్లింది..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోనే పెద్ద చెరువులో వర్షాకాలం మొదలైన నాటి నుండి సరిగా వర్షాలు లేక రైతన్న దిగులు చెందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలకు గాను ఆదివారం అలుగు పారడడంతో గ్రామస్తులు అని చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంస్థాన్ సిర్పపల్లి, ఇందల్ వాయి చెరువులు నిండితేనే ప్రాజెక్ట్ రామడుగు నిండుకుండ లాగా నిండుతుంది. ఇక్కడి నుండి వేరే గ్రామాలకు సాగునీరు అందుతుంది.



అలుగెల్లిన చెరువు

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి, సీఎస్
- వీసీ ద్వారా కలెక్టర్లు, సీ.పీలు, ఎస్పీలతో సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఆదివారం వారు డీ.జీ.పీ డాక్టర్ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్ లు, పోలీస్ కమిషనర్ లు, ఎస్పీలతో వరద ప్రభావిత పరిస్థితులను సమీక్షించారు. ఒక్కో జిల్లా వారీగా ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, చేపడుతున్న సహాయక చర్యల గురించి ఆరా తీశారు. మరో రెండు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. అధికారులు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, భారీ వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంతవరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన పక్షంలో రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపిస్తామని పేర్కొన్నారు. అయితే, ఎన్డీఆర్ఎఫ్ బృందాల వచ్చే వరకు వేచి చూడకుండా, పోలీసులు, ఫైర్ సిబ్బంది సేవలను వినియోగిస్తూ ప్రాణనష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్లాటూన్ల పోలీస్ బలగాలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. చేపల వేటకు, ఈత సరదా కోసం చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ సిబ్బందిచే నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. వర్ష ప్రభావిత జిల్లాలలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లో లెవల్ వంతెనలు, కాజ్ వే లపై నుండి నీరు ప్రవహిస్తున్న మార్గాల గుండా వాహనాల రాకపోకలను నిషేధిస్తూ, ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని సూచించారు. చెరువులు, కుంటలు, వాగులు తెగిపోకుండా ముందస్తు అప్రమత్తతో కూడిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ వరద పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, చెరువుల వద్ద ప్రత్యేకంగా భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

వేల్పూర్ మండలం పచ్చల నడుకుడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుల్లెట్ రమేష్‌ను బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. బుల్లెట్ రమేష్ వాళ్ళ అన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నెలకొల్పిన కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న విధానాన్ని, సంబంధిత అధికారులకు వెంటదివెంట సమాచారం తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిని ఎవరికి తెలియజేశారు తదితర వివరాలను కంట్రోల్ రూమ్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ టైపిస్టు అహ్మద్ పాషాను అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాల అధికారులను అప్రమత్తం చేయాలని, నిరంతరం 24/7 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసినందున పూర్తి జాగరూకతతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కాగా వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు నెలకొంటే ప్రజలు ఏ సమయంలోనైనా కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462 - 220183కు సమాచారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ఏ.ఓ ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

బాన్సువాడలో అత్యవసర సేవలు ఏర్పాటు

- సమస్య వస్తే కాల్‌చేయండి
- బాన్సువాడ మున్సిపల్ చైర్మన్, కమిషనర్ వెల్లడి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలంటూ బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం అత్యవసర సేవలను ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్మన్ జగ్గం గంగాధర్, కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్య వస్తే అత్యవసర సేవల కొరకు 7386093132, 7386188454 నెంబర్లకు ఫోన్ చేయాలని వారు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

కంట్రోల్ రూం ఏర్పాటు : మద్నూర్ తహసీల్దార్ ముజీబ్

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల మద్నూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప, మిగతా సమయంలో ఇంట్లో నుండి బయటకు రావొద్దని మద్నూర్ ఉమ్మడి మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత సాధారణ పనులకు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండల ప్రజలు భారీ వర్షాల వల్ల ఇల్లు కూలిన, వాగులు పొంగిన, ప్రమాదాలు సంభవిస్తే వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం గోజేగావ్ గ్రామం వద్ద ఉన్న లేండి వాగు ప్రవాహాన్ని మండల గిర్దవార్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. మిగతా వాగులు వంకలు ఉన్నచోట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగుల ప్రవాహం ఉన్నట్టయితే వాగులను దాటవద్దని, విద్యుత్తు స్తంభాలు, వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08464-293099, తహసీల్దార్ 9491036924, మండల గిర్దవార్ 9441570567 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఎడతెరపిలేని వర్షం

- రోడ్లన్నీ జలమయం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- అలుగుపారిన చెరువులు
- పలు గ్రామాల్లో రోడ్లు మూసివేత





కామారెడ్డి : అటువైపు వెళ్లొద్దని పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు.. వర్షం నీరు రావడంతో పోలీస్ సహాయంతో బయటకు వచ్చిన మహిళ..

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అలాగే పలు గ్రామాల్లో చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. పలు చెరువులు అలుగులు పారడంతో గ్రామాలకు రాకపోకలు బందయ్యాయి.

కామారెడ్డి : జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమై ఇళ్లలోకి సైతం నీరు వచ్చి చేరింది. కొన్నిచోట్ల చిన్న వర్షానికి రోడ్లన్నీ వరదతో నిండిపోతుంటే మరికొన్ని చోట్ల తీవ్ర ఇబ్బందిగా మారింది. నిజాంసాగర్ రోడ్‌లో వ్యక్తి నాలాను కబ్జా చేసి భవనం నిర్మించుకున్న అప్పటి మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రతి సంవత్సరం వర్షం పడిన సమయంలో నిజాంసాగర్ రోడ్డు పూర్తిగా జలమయమై ప్రజలు నడవడానికి ఇబ్బందిగా మారుతోంది. ఇదే రోడ్డులో గల జీవధాన్ హాస్పిటల్ మధ్యన వర్షం నీరు ఎక్కువగా వెళుతుండడం వల్ల ఆ రోడ్డును పోలీసులు ఒక వైపు బంద్ చేశారు. అదేవిధంగా పిఎంహెచ్ కాలనీ, రైల్వే ట్రాక్ వెనక సైడ్ రోడ్డును ఒకవైపు మూసి వేశారు. ప్రస్తుతం గోదాంరోడ్డు, రామారెడ్డి రోడ్డులో కూడా వరద నీరు ఎక్కువగా ఉండటంతో అటు వెళ్లకుండా ఆపివేశారు. దీనికి అంతటికి గతంలో మున్సిపల్ రాజకీయమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఒకరకంగా ఇస్తూ వారు భవనాలను మరోరకంగా నిర్మిస్తున్నా.. వారిని మున్సిపల్ అధికారులు నిలుపుదల చేయకపోవడంతో కామారెడ్డిలో ఎటు చూసినా వర్షం నీరు కనిపిస్తోంది.

వృద్ధురాలిని కాపాడిన కామారెడ్డి పోలీసులు..

భారీ వర్షం కారణంగా వరద నీటిలో చిక్కుకున్న వృద్ధురాలిని పోలీస్ సిబ్బంది కాపాడారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి కామారెడ్డి పట్టణంలో 36వ వార్డులో చోటుచేసుకుంది. కామారెడ్డి పట్టణంలోని 36 వార్డులో నివాసం ఉంటున్న వృద్ధురాలి ఇంటిలోకి వరద నీరు వచ్చి చేరడంతో కేకలు వేయడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసు సిబ్బంది షేక్ ముబిన్ మరో సిబ్బందితో కలిసి రాత్రి ఒంటి గంటకు ఆ మహిళ ఇంటికి చేరుకొని ఇంటి లోపల ఉన్న వృద్ధురాలి బయటకు వచ్చే వీలులేకపోవడంతో ప్రహరీ గోడ ఎక్కి తలుపు తీసి వృద్ధురాలిని వరద నీరు నుంచి క్షేమంగా బయటకు తీశారు. వృద్ధురాలికి పరిచయమున్న వారి ఇంటిలో సురక్షితంగా దించారు. వరద నీటిలో ఇరుక్కున్న వృద్ధురాలిని కాపాడిన కామారెడ్డి పోలీసులకు చుట్టుపక్క ప్రజలు అభినందించారు.

కామారెడ్డి పెద్ద చెరువును సందర్శించిన బిజెపి నాయకులు..

భారతీయ జనతా పార్టీ కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్ బిజెపి నాయకులతో కలిసి కామారెడ్డి చెరువును సందర్శించారు. చెరువు అలుగు పొంగిపొర్లుతుంటే గంగామాతకు కొబ్బరికాయ కొట్టి ప్రతి సంవత్సరం ఇలాగే అలుగు పొంగి పొర్లి రైతులందరూ ఆనందంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు పడుతుండడంతో అందరూ జాగ్రత్తగా ఉండాలని వీలైనంతవరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలని సందర్భంగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అవధూత నరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ నేత, రాజు పటేల్, ఉపాధ్యక్షులు సబ్బని ప్రవీణ్ కుమార్, రజనీకాంత్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దు

- కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి



జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటకు రావొద్దని జిల్లా ఎస్పీ సింధు శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో సాయంత్రం వరకు నిండి పొంగిపొర్లే అవకాశం ఉన్నందున, చుట్టుపక్క ప్రజలు, నాగిరెడ్డి పేట్, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల ప్రజలతో పాటు ముంపు గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే డయల్ 100కు లేదా 8712686133 నెంబర్‌కు ఫోన్‌చేసి పోలీస్ వారి సేవలు పొందలాని పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా జిల్లావ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉందని, కాలి నడకన, వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, చెరువులు, వాగులు, నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24/7 అందుబాటులో ఉండేవిధంగా బృందాలను సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నా.. వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు. ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలకు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నీట మునిగిన డబుల్ బెడ్రూంలు.. ప్రాణాలు కాపాడిన ఎస్సై..

తెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ మండలంలో శనివారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షం కారణంగా రామేశ్వర్‌పల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నీట మునిగాయి. ఆదివారం సమాచారం అందుకున్న పోలీసులు డబుల్ బెడ్ రూమ్ ప్రాంతానికి చేరుకొని అందులో నివసిస్తున్న వారిని ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బాధితులను స్వయంగా నీటిలో నుండి నడుచుకుంటు వెళ్ళి పిల్లలను, ప్రజల ప్రాణాలు కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విధి నిర్వహణలో భాగంగా సమయస్ఫూర్తితో స్పందించి నీట మునిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నుండి ప్రజల ప్రాణాలు కాపాడిన ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

తెగిపోయిన రోడ్లు.. నిలిచిన రాక పోకలు

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలో భారీ వర్షాల కారణంగా భిక్కనూరు నుండి అంతంపల్లి గ్రామానికి ఇటీవల వేసిన బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. భిక్కనూర్ నుండి మల్లుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో పెద్ద మల్లారెడ్డి చెరువులోకి భారీ వర్షం నీరు వెళ్లడం, పట్టణ కేంద్రం నుండి హరిజనవాడ కాలనీకి, సిద్ధ రామేశ్వర ఆలయం వెళ్లే మార్గంలో భారీ వర్షం నీరు చేరడంతో రాకపోకల నిలిచిపోయాయి. రామేశ్వర్‌పల్లి గ్రామంలో చెరువు కట్ట తెగిపోవటాన్ని గమనించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించడంతో సకలానికి స్పందించిన అధికారులు కట్ట తెగిపోకుండా మొరంపోసి అడ్డుకట్ట వేశారు. పట్టణంలోని దాసినమ్మ కుంటలోకి భారీగా వర్షం నీరు చేరడంతో సమీపంలో నిర్మించుకున్న ఇండ్లలోకి వర్షపు నీరు చేరడాన్ని గమనించిన అధికారులు నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాల కారణంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఇంటి నుండి బయటకు రావద్దని, ఆపద సమయంలో అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రానికి చెందిన మేదరి గంగవ్వ ఇల్లు భారీ వర్షానికి పాక్షికంగా కూలింది. సమాచారాన్ని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా అందజేశారు.



ప్రధాన రహదారిపై నెలకొరిగిన చెట్టు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



నాగిరెడ్డిపేట్ మండల కేంద్రం సమీపంలో గోలి లింగాల్ కమాన్ వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై గల చెట్టును పక్కకు తొలగించారు. తద్వారా యధావిధిగా రాకపోకలు కొనసాగాయి.

తాత్కాలికంగా రోడ్డు మూసివేసిన పోలీసులు..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి వాగు ఉద్రిక్తంగా ప్రవహించడంతో ఆదివారం ఎల్లారెడ్డి మండల కేంద్రం నుండి తిమ్మారెడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న లో లెవెల్ వంతెన పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై మహేష్ సిబ్బందితో వెళ్లి వంతెనను పరిశీలించారు. లోలెవెల్ వంతెనపై ప్రమాదకరంగా నీరు ప్రవహించడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు. నీటి ప్రవాహం తగ్గే వరకు ఎవరైనా ఈ రోడ్డుపై ఉన్న వంతెన దాటే సాహసం చేయవద్దని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

అమర్లబండ జలదిగ్బంధం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అమర్లబండ గ్రామం జలదిగ్బంధమైంది. భారీ వర్షానికి రెండు దారుల గుండా నీరు ప్రవహిస్తోంది. అత్యవసర పరిస్థితిలో గ్రామస్తులు బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

వాగునీటి ప్రవాహాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

మండలంలోని అమర్ల బండ వాగునీటి ప్రవాహాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. మండలంలో వివిధ గ్రామాల్లో వరద పరిస్థితిని సమీక్షించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డిఎల్‌పిఓ శ్రీనివాస్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నేలకొరిగిన స్తంభాలు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రెండు రోజులుగా ఏకతాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలోని బంజారా తండా సమీపంలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో మండల కేంద్రానికి ఐదు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఏఈ మనోరంజన్ మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరా చేయించారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కామారెడి

కామారెడ్డి పట్టణంలోని భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో 18వ, వార్డును కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలకు తమ సూచనలు చేశారు. ఎవరైనా అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని రాబోయే రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, పాడుబడిన ఇండ్లలో, కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లలో ఉండకూడదనీ, శిథిలావస్థలో ఉండే ఇండ్లలో నివసించే వారు వార్డు కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బందికి సమాచారాన్ని అందిస్తే దగ్గరలో గల ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఈ వర్షభావ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పిల్లలు, పెద్దలు విద్యుత్ స్తంభాల దగ్గర, కరెంట్ లైన్ల కింద, చెట్ల కింద ఉండకూడదన్నారు. ఎప్పుడు ఎలాంటి పరిస్థితి వస్తుందో అంచనా వేయలేమని అందరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ మిర్జా ఆఫీస్ బేగ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన తహసీల్దార్

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో నిరుపేద వికలాంగురాలి కుటుంబాన్ని శిథిలావస్థలో చేరిన ఇంటి నుండి స్థానిక పాఠశాల భవనంలో బోధన్ తహశీల్దార్ విఠల్ ఆశ్రమం కల్పించారు. వికలాంగురైన తల్లి కూతుర్లు శిథిలావస్థకు చెరిన ఇంటిలో నివాసం ఉండడంతో స్థానికులు వారి బాధను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేశారు. దానికి స్పందించిన తహసిల్దార్ విట్టల్ గ్రామానికి చేరుకొని నిరుపేదలను స్థానిక ప్రభుత్వ పాఠశాల భవనంలో చేర్పించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాధితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బోధన్‌లో భారీ వర్షం..

బోధన్‌లో ఆదివారం భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన బోధన్ మండలంలో భారీ వర్షం కురిసింది. బోధన్ మండలంలో 52.2 మి.మీ వర్షపాతం, సాలూర మండలంలో 45.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు మండల వాతావరణ శాఖ అధికారి అశోక్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో, మంజీర పరివాహక ప్రాంతంలో రైతులు, పశువుల కాపరులు ఎవరు వెళ్లవద్దని బోధన్ రూరల్ ఎస్సై మచ్చందర్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర సమయంలో వరద సహాయ కేంద్రానికి, పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేరిన నీరు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురవడంతో పోచారం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి భారీగా వరద నీరు చేరింది.



వరద బాధితుల తరలింపు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు వరదలో చిక్కుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బీర్కూరు మండల కేంద్రంలో ఇండ్లు కూలే పరిస్థితిలో గల నాలుగు కుటుంబాలకు పునరావాస కేంద్రాలకు తరలించామని తహశీల్దార్ లత తెలిపారు. ఆదివారం బీర్కూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం కారణంగా శిథిలావస్థకు చేరుకున్న నివాసపు ఇండ్లను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు. వర్షం కారణంగా బీర్కూర్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ఆమె పరిశీలించారు. గవర్నమెంట్ హైస్కూల్ వద్ద వీరికి పునరవాసం కల్పించారు. వీరి వెంట ఎంపీఓ మైబూబ్, ఏఎస్ఓ రామారావు, పంచాయతీ కార్యదర్శి గంగారం, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న దారులు మూసివేత



నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహాడ్‌కు వెళ్లే రహదారిలో పులి క్యాంప్ తండా వాసుల ఇండ్లలోకి వాగు పొంగి నీరు చేరింది. అక్కడి ప్రజలు వాగు వైపు వెళ్లకుండా, అలాగే కోకుల్ దాస్ తండా పైడిమాల్ గ్రామానికి వెళ్లే దారి వాగు కూడా పొంగిపొర్లుతున్నందున ప్రజలు రోడ్డు దాటి వెళ్లకుండా ట్రాక్టర్‌లను అడ్డుగా పెట్టిన దారులను మూసివేశారు. తహసీల్దార్ సాయిలు, ఎస్ఐ కృష్ణకుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్ ఇతర అధికారులు వాగులను ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు వసతులను కలిపించి సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హుమ్నాపూర్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి వారికి గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్‌లలో నివాసం కల్పించారు. అత్యవసరం ఉంటే తప్పా బయటకు రావొద్దని ప్రజలకు పలు సూచనలు చేశారు.

భారీ వర్షంలోనూ విద్యుత్ అధికారులు సేవలు

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 11 కె.వి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ అధికారులు స్పందించి భారీ వర్షంలో సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ పనులు పునరుద్ధరించారు. పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడగానే సమయస్ఫూర్తితో విద్యుత్ అధికారులు స్పందిస్తూ వర్షంలో సైతం పనులు చేయడంతో ప్రజలు విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపోయిన, అంతరాయం ఏర్పడిన అధికారులకు సమాచారం అందించాలని, వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ వైర్లు, కరెంటు స్తంభాలను తాకవద్దని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ పనులలో లైన్ ఇన్స్పెక్టర్ బాలరాజ్, లైన్మెన్ మాణిక్యం, రవిచంద్ర, జేఎల్ఎం లక్ష్మణ్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.